RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 232 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 18-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :232 | 18-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-






## యుద్ధంలో తొలిసారిగా సెజిల్ క్షిపణి ప్రయోగం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

యుద్ధంలో క్షిపణులు, డ్రోన్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్న ఇరాన్.. తన దివ్యాస్త్రాన్ని బయటకు తీసింది. డ్యాన్సింగ్ మిసైల్‌గా పేరొందిన సెజిల్ క్షిపణిని తొలిసారిగా ఇజ్రాయెల్, అమెరికా లక్ష్యాలపైకి ప్రయోగించింది. ప్రత్యర్థి గగనతల రక్షణ వ్యవస్థలను అయోమయానికి గురిచేసే ఇలాంటి అస్త్రాలతో యుద్ధ వేడి మరింత పెరగడం ఖాయం.

**ఏమిటీ సెజిల్?**


ఇది రెండంచెల ఘన ఇంధన, మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో ఇరాన్ అభివృద్ధి చేసింది. దీనికి చైనా సాయం అందించి ఉండొచ్చన్న వాదన కూడా ఉంది. సెజిల్ అభివృద్ధి 1990ల చివర్లో మొదలైంది. జెల్‌జాల్ వంటి స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల రూపకల్పనలో గడించిన అనుభవం ఆధారంగా ఈ ప్రాజెక్టును ఇరాన్ చేపట్టింది. సెజిల్‌లో ఘన ఇంధన వినియోగానికి కూడా ఆ పూర్వ అనుభవం దోహదపడింది. పరిమాణం, బరువు, పరిధి వంటి అంశాలపరంగా ఈ క్షిపణి.. మునుపటి షాహాబ్-3ని పోలి ఉంటుంది. అయితే ఆ అస్త్రం కన్నా ఇది చాలా మెరుగైంది. ఘన ఇంధనాన్ని వాడటం వల్ల సెజిల్‌ను వేగంగా ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. అందువల్ల లాంచింగ్ సమయంలో శత్రుదాడులకు ఇది గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ఘన ఇంధనాన్ని చాలా ముందుగానే క్షిపణిలో నింపి ఉంచొచ్చు. ద్రవ ఇంధనాల తరహాలో ప్రయోగానికి కొద్దిసేపటి ముందు మాత్రమే నింపాల్సిన అవసరం ఉండదు. ఘన ఇంధన క్షిపణులను చాలా సులువుగా ఒకచోటు నుంచి మరో చోటుకు తరలించొచ్చు. ఘన ఇంధన క్షిపణులకు సంబంధించిన కొన్ని అంశాల కారణంగా.. గాల్లో వాటి నియంత్రణ, మార్గనిర్దేశం చాలా కష్టం. ఈ అవరోధాలను ఇరాన్ ఇంజినీర్లు ఎలా అధిగమించారన్నది అంతుచిక్కకుండా ఉంది. షాహాబ్ గైడెన్స్ వ్యవస్థలను మార్చడం లేదా విదేశీ సాయం తీసుకోవడం వల్ల ఇది సాధ్యమై ఉంటుందని భావిస్తున్నారు.

**విస్తృతంగా పరీక్షలు..:** కొత్త పరిజ్ఞానాలను వాడటం వల్ల సెజిల్‌ను ఇరాన్ విస్తృతంగా పరీక్షించింది. దాని తొలి పరీక్ష 2008లో జరిగింది. నాడు అది 800 కిలోమీటర్లు ప్రయాణించింది. మెరుగైన మార్గనిర్దేశక వ్యవస్థల జోడింపు అనంతరం 2009 మే

తరువాయి 2లో..

# ఏపీలో గ్యాస్ కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు

## రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు, సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గ్యాస్ కొరతపై ఊహాగానాలు వస్తుండడం పట్ల ఆయన అధికారులతో చర్చించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని, మరో 15 రోజులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని సీఎం వెల్లడించారు. అమరావతిలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు గ్యాస్ కొరత రాకుండా నిరంతరాయంగా సరఫరా చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఇండక్షన్ స్టవ్‌ల ఉత్పత్తి, పంపిణీని పెంచి వాటి లభ్యతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదే సమయంలో, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తరించి, కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా ఇళ్లకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గృహ వినియోగానికి గ్యాస్ కొరత లేదని, సరఫరా సజావుగా సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు.

**రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు...:** రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు

తరువాయి 2లో..

# ప్రధాని మోదీ దేశానికి నిజమైన సంరక్షకుడు

## వరుణ్ గాంధీ ప్రశంసలు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



బీజేపీ నేత, పిలిభిత్ ఎంపీ వరుణ్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశానికి, దేశ ప్రజలకు మోదీయే నిజమైన సంరక్షకుడు అని ఆయన అభివర్ణించారు. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని మోదీని కలిసిన వరుణ్, ఈ భేటీ తనకు లభించిన గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఆయన తన అభిప్రాయాలను

తరువాయి 2లో..

# ఏపీలో విభిన్నమైన వాతావరణం

## కోస్తాలో చల్లచల్లగా... రాయలసీమలో సెగలుపొగలుగా...!




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు రాయలసీమ జిల్లాలు ఎండలతో

తరువాయి 2లో..

# తప్పు రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటా: నారా లోకేశ్




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పు పునరావృతం అయినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. చిన్న సమస్య ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ఈ పవిత్ర బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఓ పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన మంత్రి లోకేశ్, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. కొత్త

తరువాయి 2లో..

# 'మాకు ఎవరి అవసరం లేదు'

## మిత్ర దేశాల షాక్ వేళ ట్రంప్ వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌తో యుద్ధం వేళ.. బలప్రయోగం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్

తరువాయి 2లో..


# డాలర్ చాప కిందికి చమురు?

## చైనా కరెన్సీలో చెల్లిస్తే హర్మూజ్ దాటేందుకు అనుమతి

## అమెరికా ఎత్తులకు ఇరాన్ పైఎత్తు?

## ట్రంప్‌పై స్వదేశంలో ఒత్తిడి పెంచే వ్యూహం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



ఎలాగైనా సరే ఇరాన్ మెడలు వంచాలని అమెరికా చూస్తుంటే... ట్రంప్ మెడకే యుద్ధ ప్రభావం గట్టిగా చుట్టుకునేలా ఇరాన్ పావులు కదుపుతోంది! వెరసి పశ్చిమ ఆసియా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపే దిశగా సాగుతోంది! పైకి డ్రోన్లు, క్షిపణులతో మధ్య ఆసియా యుద్ధాన్ని కొనసాగిస్తున్న ఇరుపక్షాలు... లోలోన ఆర్థిక అస్త్రాలకు పదును పెడుతున్నాయి. ఇరాన్‌కు చమురు జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపంపై పట్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులు వేస్తుంటే ఏకంగా అగ్రరాజ్య ఆర్థిక ఆధిపత్యానికి మూలమైన డాలర్‌ను దెబ్బతీసేందుకు టెహ్రాన్ పైఎత్తులు వేస్తోంది. డాలర్‌కు పోటీగా... తన మిత్రదేశమైన చైనా కరెన్సీ యువాన్‌ను అంతర్జాతీయ మారకంగా ప్రోత్సహించేలా అడుగులు

తరువాయి 2లో..

# ప్రజలను పార్టీలుగా చూడొద్దు

## ప్రభుత్వాలపై వైఎస్ షర్మిల ఫైర్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గత వైసీపీ ప్రభుత్వంపైనా, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపైనా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# పెరిగిపోతున్న నిరక్షరాస్యత..

### పెద్దలే కాదు యువతలో భారీ మార్పు!

ప్రపంచం ఎంత వేగంగా డిజిటల్ యుగం వైపు దూసుకుపోతున్నా, అక్షరజ్ఞానం లేని వారి సంఖ్య మాత్రం భయంకరంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 77 కోట్ల మంది పెద్దలు, 12 కోట్ల మందికి పైగా యువత కనీసం ఒక చిన్న వాక్యాన్ని కూడా చదవలేకపోవడం లేదా రాయలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అంటే జనాభాలో దాదాపు 10 శాతం మంది అక్షరాలకు దూరంగా ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. ఆ వివరాలు చూద్దాం.. సాధారణంగా నిరక్షరాస్యత అంటే కేవలం వయసు పైబడిన వారికే పరిమితం అని మనం అనుకుంటాం. కానీ తాజా గణాంకాలు చూస్తుంటే యువతలో కూడా ఈ సమస్య వేగంగా విస్తరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 12.6 కోట్ల మంది యువత ప్రాథమిక విద్యకు దూరంగా ఉండటం భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. సరైన పాఠశాలలు లేకపోవడం, పేదరికం కారణంగా చదువు మధ్యలోనే మానేయడం వంటి కారణాలు యువతను అక్షర శత్రువులుగా మారుస్తున్నాయి. ఇది వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ, వారిని తక్కువ వేతన పనులకే పరిమితం చేస్తోంది. నిరక్షరాస్యత అనేది కేవలం ఒక వ్యక్తి సమస్య మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. ఒక వ్యక్తి చదవలేకపోతే తన హక్కుల గురించి తెలుసుకోలేడు, కనీసం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను కూడా పొందలేడు. ఇక 77 కోట్ల మంది పెద్దలు అక్షర జ్ఞానం లేకుండా ఉండటం అంటే, సమాజంలో ఒక పెద్ద విభాగం నిర్ణయాధికారంలో వెనుకబడి ఉందని అర్థం. ఇది వారి ఆరోగ్యం, కుటుంబ పోషణ మరియు సామాజిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అక్షరాస్యత పెరిగితేనే పేదరికం నుంచి విముక్తి లభిస్తుంది. ప్రభుత్వాలు కేవలం చట్టాలు చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో విద్యను ప్రతి బిడ్డకు అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి బడులు, వయోజన విద్యా కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇక నేటి కాలంలో కేవలం చదవడం, రాయడమే కాదు.. కనీస డిజిటల్ అక్షరాస్యత కూడా అవసరం. స్మార్ట్‌ఫోన్ యుగంలో ఉన్నాం కాబట్టి, యాప్స్ మరియు ఆన్‌లైన్ క్లాసుల ద్వారా అక్షరాలను నేర్పించే వినూత్న కార్యక్రమాలను చేపట్టాలి. యువత తమ ఖాళీ సమయాల్లో నిరక్షరాస్యులకు విద్యను బోధించేలా స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాలి. అక్షరం అనేది చీకటిలో వెలుగు లాంటిది. ప్రపంచ జనాభాలో 10 శాతం మంది ఇప్పటికీ ఆ వెలుగుకు దూరంగా ఉండటం మనం సిగ్గుపడాల్సిన విషయం. ఇక అక్షరాస్యత సాధించడం అనేది కేవలం సర్టిఫికెట్ల కోసం కాదు, అది ఒక మనిషి గౌరవప్రదంగా బతకడానికి అవసరమైన ఆయుధం. ఇక మన చుట్టూ ఉన్న ఒక్కరికైనా అక్షరాలు నేర్పించగలిగితే, ఈ గణాంకాల్లో మార్పు తీసుకురావడం అసాధ్యమేమీ కాదు. రేపటి సమాజం జ్ఞానవంతంగా ఉండాలంటే నేటి నుండే అక్షరాస్యతపై యుద్ధం ప్రకటించాలి.

# 'మాకు ఎవరి అవసరం లేదు'

ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. తమకు ఎవరి అవసరం లేదన్నారు. హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు తాము ఒంటరిగానే ప్రయత్నిస్తామని చెప్పారు. "మాకు ఎవరి అవసరం లేదు. మాది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశం. అత్యంత శక్తిమంతమైన సైన్యం మాకుంది" అని అధ్యక్షుడు వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిపై మిత్ర దేశాలు కలిసి రాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ (ణశీఖుశ్రీం ుతీబఎజూ) ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# ఇరాన్ 'నృత్య' విధ్వంసం!

నెలలో జరిగిన రెండో ప్రయోగంలో ఈ క్షిపణి మంచి పనితీరును కనబర్చింది. ఆ తర్వాత నాలుగుసార్లు ఈ ప్రయోగం జరిగింది. ఆరో ప్రయోగంలో ఈ అస్త్రం 1,900 కిలోమీటర్ల దూరం ప్రయాణించి హిందు మహాసముద్రంలో పడింది. దీని వేగం ఎంత అన్నది పూర్తిగా వెల్లడికాలేదు. అయితే సెంట్రల్ ఇరాన్ నుంచి ప్రయోగిస్తే ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరాన్ని ఏడు నిమిషాల్లోనే చేరుకోగలదని ఇరాన్ గతంలో పేర్కొంది.

**బహుళ వెర్షన్లు**

సెజిల్ వ్యవస్థకు సంబంధించి బహుళ వెర్షన్లు ఉండొచ్చని భావిస్తున్నారు. 2009లో చేపట్టిన ప్రయోగాన్ని సెజిల్–2 వెర్షన్‌గా ఇరాన్ అభివర్ణించింది. సెజిల్–3 వెర్షన్ అభివృద్ధి దశలో ఉండొచ్చని చెబుతున్నారు. అందులో మూడు అంచెలు ఉండొచ్చని, అది గరిష్ఠంగా 4వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని, ప్రయోగ సమయంలో దీని బరువు 38వేల కిలోలు ఉండొచ్చని భావిస్తున్నారు. దశాబ్దకాలం స్తబ్దుగా ఉన్న సెజిల్ ప్రాజెక్టు తిరిగి 2021లో వార్తల్లోకి వచ్చింది. నాడు సైనిక విన్యాసాల్లో దీన్ని ఇరాన్ ప్రయోగించింది. అందులో మెరుగైన గైడెన్స్ వ్యవస్థను ఉపయోగించింది. కఠిన పరిస్థితులను తట్టుకునే 'స్ట్రాప్–డౌన్' గైడెన్స్ వ్యవస్థను కూడా ఇందులో ఏర్పాటు చేశారు.

**డ్యాన్సింగ్ మిసైల్ అని ఇందుకే పేరు..:** సాధారణంగా సంప్రదాయ క్షిపణులు.. ప్రయోగానంతరం ఊహించగలిగే ప్రయాణమార్గంలో పయనిస్తాయి. సెజిల్ తీరు దీనికి భిన్నం. గగనతలంలో ఇది తన ప్రయాణమార్గాన్ని సర్దుబాటు చేసుకోగలదు. నేల నుంచి చాలా ఎత్తులో ఒడుపుగా చేసే ఈ విన్యాసాల వల్ల దీని ప్రయాణమార్గాన్ని అంచనా వేయడం కష్టం. అందుకే దీనికి డ్యాన్సింగ్ మిసైల్ అని పేరు వచ్చింది. ఈ సామర్థ్యం వల్ల ప్రత్యర్థి రాడార్ వ్యవస్థలకు చుక్కలు కనిపిస్తాయి. శత్రు క్షిపణి ఎటు పయనిస్తుందన్నది అంచనావేయడం ద్వారా గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేస్తుంటాయి. నింగిలో ఒక క్షిపణిని రాడార్ గుర్తించగానే.. దాని గమనాన్ని కంప్యూటర్లు లెక్కిస్తాయి. వాటి ఆధారంగా దాన్ని ఢీ కొట్టగలిగేలా ఇంటర్‌సెప్టర్ క్షిపణికి మార్గనిర్దేశం చేస్తాయి. అయితే సెజిల్ వంటి క్షిపణులు చివరిదశలో తమ ప్రయాణ మార్గాన్ని అనూహ్యంగా మార్చేసుకుంటాయి. అలాంటి పరిస్థితుల్లో వాటిని ఢీ కొట్టడం కష్టమవుతుంది. ఇజ్రాయెల్‌కు చెందిన అధునాతన 'ఐరన్ డోమ్'ను కూడా ఈ క్షిపణి బోల్తా కొట్టించగలదని చెబుతున్నారు. దీనికితోడు సెజిల్–2పై యాంటీ రాడార్ పూత ఉన్నట్లు చెబుతున్నారు. దీనివల్ల సాధారణ గగనతల రక్షణ రాడార్లు దాన్ని లక్ష్యంగా చేసుకోవడం కష్టమన్న అభిప్రాయం ఉంది.

# తప్పు రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటా: నారా లోకేశ్

కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు బదులిచ్చారు. వివాదం జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉండేదని కూడా మంత్రి ఆరా తీశారు. భోజనంలో ఏమైనా సమస్యలుంటే ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఇకపై భోజనం నాణ్యతపై 'లీప్' యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను పరిశీలిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం అధికారులతో మాట్లాడిన మంత్రి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని గట్టిగా హెచ్చరించారు. "మీపై పవిత్ర బాధ్యత ఉంది. విద్యార్థులకు సంబంధించి చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, వెంటనే పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. భోజనం నాణ్యతపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలోని రికార్డులు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మధ్యాహ్న భోజనంపై నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి గుర్తుచేశారు. సమూల మార్పుల కోసం రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామన్నారు. వారంలో ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.

# డాలర్ చాప కిందికి చమురు?

వేస్తోంది.

**ట్రంప్‌పై పెరుగుతోన్న ఒత్తిడి**

తమ దేశంపై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ పచ్చజెండా ఊపే నౌకలకే ప్రస్తుతం హర్మూజ్ దాటడానికి అనుమతి లభిస్తోంది! రోజువారీ ప్రపంచ చమురు రవాణాలో 20శాతం ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఫలితంగా చాలా దేశాల్లో చమురు కొరత ప్రభావం కనిపిస్తోంది. అమెరికాపై పరోక్ష ఒత్తిడి పెరిగింది. హర్మూజ్ జలసంధిని తెరిపించటం తమ వల్ల కాకపోవటంతో నాటో దేశాలు కలసి రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. కానీ జర్మనీ, యూకేలాంటి కీలక నాటో దేశాలు అందుకు ససేమిరా అంటున్నాయి. ఇరాన్‌కు పర్షియన్ గల్ఫ్‌లో అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంపై బాంబులతో దాడులు చేయించడంతో ఆగకుండా సైనికులను కూడా దించి దానిని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ యోచిస్తున్నట్లు వాషింగ్టన్ నుంచే వార్తలొస్తున్నాయి. ఇరాన్ 90 శాతం ఎగుమతులకు ఖర్గ్ ద్వీపమే ముఖద్వారం. దాదాపు 3కోట్ల బ్యారెళ్ల చమురును ఇక్కడ ఆ దేశం నిల్వ ఉంచుతుంది. ఈ ద్వీపాన్ని కోల్పోతే టెహ్రాన్ ఆర్థికవ్యవస్థ చతికిలపడుతుంది.

**ఆయన మెడకే చుట్టాలని...**

అందుకే ట్రంప్ వ్యూహానికి ప్రతివ్యూహాన్ని ఇరాన్ ప్రచారంలోకి తెచ్చింది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్‌ను ఇరకాటంలోకి నెట్టేసేలా డాలర్ ఆధిపత్యానికే ఎసరు పెడుతోంది. 1974లో అమెరికా, సౌదీ అరేబియాల మధ్య జరిగిన ఒప్పందం తర్వాత చమురు కొనుగోళ్లకు డాలర్లలో చెల్లింపులు జరుగుతున్నాయి. నేటికీ 80 శాతం ప్రపంచ చమురు కొనుగోళ్లు డాలర్లలోనే జరుగుతున్నాయి. దీన్నే పెట్రో–డాలర్ వ్యవస్థ అంటారు. అంటే ఏ దేశమైనా ముడి చమురు కొంటే డాలర్లలో చెల్లింపులు చేస్తుంది. అలా డాలర్‌కు శాశ్వత డిమాండ్ పెరిగి... అంతర్జాతీయ మారకంగా మారటమేగాకుండా అమెరికా ఆర్థిక ఆధిపత్యానికీ బాటలు వేసింది. ఇప్పుడు డాలర్‌కు బదులు చైనా కరెన్సీ యువాన్‌లో చెల్లింపులు చేసేవారి నౌకల రాకపోకలకు హర్మూజ్ జలసంధి ద్వారా అనుమతించాలని ఇరాన్ యోచిస్తున్నట్లు అమెరికా మీడియా వెల్లడించింది. అదే జరిగితే డాలర్ చాపకిందికి చమురు వచ్చినట్లే!

**ఇప్పటికిప్పుడు ముప్పు లేకున్నా...**

ఇప్పుడు డాలర్‌ను కాదని యువాన్‌లోనో మరే కరెన్సీలోనో చెల్లింపులు పెరిగితే... డాలర్‌కు క్రమంగా డిమాండ్ తగ్గుతుంది. అలాగని అమెరికా ఆర్థిక ఆధిపత్యం రాత్రికి రాత్రి పడిపోతుందని కాదు. అదంత సులభం కూడా కాదు. ఎందుకంటే ప్రపంచ ఆర్థిక, బ్యాంకింగ్ వ్యవస్థలన్నీ డాలర్‌తో ముడి పడి ఉన్నాయి. పైగా డాలర్ కాకుండా మరో కరెన్సీలో లావాదేవీలకు చమురు ఉత్పత్తి చేసేవారు, కొనుగోలు దేశాలు, అంతా ఓ అవగాహనకు రావాల్సి ఉంటుంది. ఇప్పటికీ గల్ఫ్‌లోని ఇతర చమురు ఉత్పత్తి దేశాలు డాలర్లలోనే కొనుగోళ్లకు ఇష్టపడతాయి. కాబట్టి ఇరాన్ చర్యలు అమలు జరిగినా... అమెరికా ఆధిపత్యానికి ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పేమీ ఉండకపోవచ్చు. కానీ చమురు మార్కెట్లు, షేర్ మార్కెట్లలో, రవాణా రంగంలో ఒడుదొడుకులు పెరగొచ్చు. బంగారం, వెండి ధరలపైనా ప్రభావం ఉండొచ్చు. ద్రవ్యోల్బణం ఎక్కువకావచ్చు. ముఖ్యంగా అమెరికాలో దీని ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇవన్నీ ఈ నవంబరులో జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌ను, రిపబ్లికన్ పార్టీని దెబ్బతీయడానికి దారితీయొచ్చు!.

# రైతన్నా మీ కోసం.... టిడిపి ఇన్చార్జ్ అమూల్య..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 17:**

రైతన్నా మీ కోసం ఉత్సవాలలో భాగంగా రైతుల బ్యాంకు ఖాతాలలో వేసి అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలలో పడినది లేనిది స్వయంగా రైతుల వద్దకే వెళ్లి అడిగి తెలుసుకుని, పాడి పంటలు పరిస్థితి తెలుసుకొనడానికి సఖినేటిపల్లి మండలం వి.వి. మెరక గ్రామంలో రాజోలు టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో రైతన్న మీకోసం సమావేశంను నిర్వహించారు. గ్రామంలోని రైతులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను పరిశీలించారు. ఆమె కూటమి ప్రభుత్వం పూర్తిగా రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను కరపత్రం రూపంలో రైతులకు పంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ వై మధుసూదనరావు, మండల టీడీపీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, పులగం రమేష్, పప్పుల రమేష్, చెల్లుబోయిన నాగబాబు, చెల్లుబోయిన జయ సూరిబాబు, కొల్లు మహాలక్ష్మి, యెనుముల రమణ, శ్రీధర్, చెల్లుబోయిన శ్రీనివాస్, గెద్దాడ వెంకటేశ్వరరావు, అంతర్వేదిపాలెం పుల్లయ్య, జానా పార్వతీశం, కొల్లు రాము, జిల్లెళ్ళ వెంకటేశ్వర్లు, అంతర్వేది పాలెం పెద్దిరాజు, జిల్లెళ్ళ పావెల్ రెడ్డి, నల్లి సువర్ణ రత్నం, చిట్టూరి సంతోష్, తాడి రాము, పంగం సుధాకర్, పప్పుల శివప్రసాద్, నందూరి యువ కిషోర్, గొల్ల జస్పాల్, చిగురుపాటి ఆనంద్ తదితర స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులు, స్థానిక రైతు కుటుంబాలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ఏపీలో గ్యాస్ కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు

సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు.

# ఏపీలో విభిన్నమైన వాతావరణం

మండిపోతుంటే, మరోవైపు కోస్తా జిల్లాలకు వర్ష సూచన జారీ అయింది. సోమవారం అనంతపురంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 38.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే సమయంలో కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కొంత తగ్గుముఖం పట్టడం గమనార్హం. ద్రోణి ప్రభావం, నైరుతి దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. పిడుగులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో వర్షాలు పడొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సోమవారం అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ వాతావరణ మార్పుల ఫలితంగా రానున్న ఐదు రోజుల్లో కోస్తా జిల్లాల్లో ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టనుందని అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేర తగ్గుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది.

# ప్రధాని మోదీ దేశానికి నిజమైన సంరక్షకుడు

పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీని నా కుటుంబంతో కలిసి కలవడం, ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని వరుణ్ గాంధీ తన పోస్టులో రాశారు. ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని, నాయకత్వాన్ని కొనియాడుతూ, "మీ వ్యక్తిత్వంలో అద్భుతమైన పితృ వాత్సల్యం, రక్షణ భావన ఉన్నాయి. మీతో భేటీ అయిన తర్వాత, మీరే ఈ దేశానికి, ప్రజలకు నిజమైన సంరక్షకుడనే నా నమ్మకం మరింత బలపడింది" అని వరుణ్ గాంధీ పేర్కొన్నారు. 1980లో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంలోని ఇతర సభ్యులతో తీవ్ర విభేదాలు రావడంతో మేనకా గాంధీ ఆ పార్టీకి దూరమయ్యారు. ఆ తర్వాత చాలా ఏళ్లకు 2004లో ఆమె తన కుమారుడు వరుణ్‌తో కలిసి బీజేపీలో అధికారికంగా చేరారు. "దేశ ప్రయోజనాల దృష్ట్యా బీజేపీలో చేరడమే సరైన నిర్ణయమని భావిస్తున్నాను" అని ఆ సమయంలో వరుణ్ గాంధీ వ్యాఖ్యానించారు. అనంతరం బీజేపీలో ఆయన కీలక నేతగా ఎదిగారు. 2012లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు.

# ప్రజలను పార్టీలుగా చూడొద్దు

తీవ్ర విమర్శలు చేశారు. సంక్షేమ పథకాలను కేవలం తమ పార్టీ కార్యకర్తలకే పరిమితం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆమె హితవు పలికారు. ప్రజలను ప్రజలుగా చూడాలి తప్ప, వారికి పార్టీ రంగు పులమడం తగదని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్.. కొత్తగా ఈ పథకం పేరును 'వీబీ జి రామ్ జి'గా మార్చిన సంగతి విదితమే) పరిరక్షణ యాత్రలో భాగంగా ఆమె శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆముదాలవలస నియోజకవర్గం కొర్లకోట గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అందరికీ పథకాలు అందేవని గుర్తుచేశారు. కానీ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చారని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ పథకం వైఎస్సార్ హయాంలో తమ జీవితాల్లో వెలుగులు నింపిందని, కానీ కేంద్రంలో బీజేపీ వచ్చాక పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన షర్మిల, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పని దినాలను 150 రోజులకు, రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతామని స్పష్టం చేశారు. నాయకులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని, ప్రజల్లో మార్పు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# కేజీహెచ్‌పిల్లల వైద్య విభాగంలో నర్సింగ్ యూనిట్ ప్రారంభం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 17**

నోయిడా లేడీస్ సర్కిల్ 210 ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సేవా కార్యక్రమమైన 'ప్రాజెక్ట్ ఆయుష్మాన్' కింద కింగ్ జార్జ్ హాస్పిటల్ , పిల్లల వైద్య విభాగం లో విశాఖపట్నంలో నూతన నర్సింగ్ యూనిట్‌ను ఈరోజు ప్రారంభించారు. ఈ నర్సింగ్ యూనిట్‌ను లేడీస్ సర్కిల్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ థీమ్ ప్రాజెక్ట్ కన్వీనర్ మరియు ఏరియా 9 ఏరియా సెక్రటరీ–ట్రెజరర్ క్. అభిజ్ఞ గ్రాంధి అధికారికంగా ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి, చైర్‌పర్సన్ డా. ధన్య అన్నా కురియన్, సర్కిలర్స్ శుభాంగిని రోహత్‌గి, అంకిత సైనీ పాల్గొన్నారు. డా. ఐ. వాణి మాట్లాడుతూ, ఈ నర్సింగ్ యూనిట్ ద్వారా ఆసుపత్రిలో మాతా–శిశు సంరక్షణ సేవలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. అలాగే, పీడియాట్రిక్స్ మరియు ఓబీజీ విభాగాల ఓపీలు, వార్డుల్లో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని నోయిడా లేడీస్ సర్కిల్‌ను కోరుతూ, వారి సేవా భావాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా లేడీస్ సర్కిల్ 210 తమ సమాజ సేవా నిబద్ధతను మరోసారి చాటిచెప్పుతూ, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. పద్మావతి,(అసిస్టెంట్ ప్రొఫెసర్) డా. సత్యవాణి (అసోసియేట్ ప్రొఫెసర్), డా. తాతం నాయుడు (అసిస్టెంట్ ప్రొఫెసర్) తో పాటు పీడియాట్రిక్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత వర్గాల ప్రజలకు మంచి మనస్సుతో చేయూత ఇవ్వాలి

### అధికారులకు సూచించిన ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మార్చి 17**

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సుమారు 500 మంది వరకు ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను వినిపించారు. వినతులను పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులకు వెంటనే పంపిస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలే ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా హౌస్ సైట్లు, పట్టాలు, అసైన్డ్ భూములను ఇతరులు ఆక్రమించారంటూ బాధితులు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భూముల ఆక్రమణలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భీమిలి, గాజువాక మండలాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిడిగట్టు, కొత్తవలస, భీమిలి ప్రాంతాల్లో ఎస్సీలు నివసించే ప్రాంతాలకు ముందుగా లేఅవుట్లు వేసి అడ్డుకున్న ఘటనలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలో దుకాణాలను నిష్పత్తి ప్రాతిపదికన ఎస్సీ లబ్ధిదారులకు కేటాయింపు చేయాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఆలస్యం చేయకుండా చెల్లించాలని ఆదేశించారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు, దళిత కాంట్రాక్టర్లకు జీవీఎంసీ, వీఎంఆర్డీఏ పనుల్లో కోటా ఇవ్వడంపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా చేపట్టే ఇంజనీరింగ్ పనుల్లో ఎస్సీ వర్గాలకు చెందిన గుత్తేదారులకు తగిన అవకాశాలు కల్పించాలని సూచించారు. సమాజంలోని బలహీన వర్గాల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించి, మంచి మనస్సుతో చేయూత అందించాలని కోరారు. అనంతరం కృష్ణాపురం పాఠశాలను సందర్శించిన ఆయన, ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో విశాఖపట్టణం ఆర్డీవో సుధాసాగర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, డీఎంహెచ్వో జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, బాధితులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రప్2047 లక్ష్య సాధనకై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

### నైపుణ్య యాప్ వినియోగం పై యువతకు అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేయాలి

### కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్ణయాల అమలుపై అధికారులకు దిశా నిర్దేశం -జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్

**అనకాపల్లి,సిటిజన్ టైమ్స్,మార్చి 17**

స్వర్ణాంధ్రప2047 సాధనలో భాగంగా నిర్ణయించిన పది సూత్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ చేపట్టి రాష్ట్రంలో జిల్లాను అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా తేది.5-3-2026న రాష్ట్ర ముఖ్యమంత్రితో జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పై జరిగిన రివ్యూ సమావేశానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేసారు. అనంతరం ఈనెల 11 మరియు 12 తేదీలలో అమరావతి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ప్రతి కుటుంబానికి బేసిక్ ఫ్యామిలీ ఎమెనిటీస్ అందేలా చూడడంతో పాటు కమ్యూనిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు కనెక్టివిటీ పెంచడం, డ్రైనేజ్ నెట్‌వర్క్ మెరుగుపరచడం, స్ట్రీట్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ (వేస్ట్ టు వెల్త్) కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సేవల నాణ్యత పెంపు, ప్రభుత్వ ప్రధాన పథకాల అమలు, వాట్సాప్ గవర్నెన్స్ పై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శి- బంగారు కుటుంబం పథకం కింద ఫ్యామిలీ






కార్డు ద్వారా కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరింత నాణ్యతతో అమలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత పెంచాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నైపుణ్య యాప్ వినియోగం పై యువతకు అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మండల, వార్డు, గ్రామ స్థాయిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలధార స్కీమ్ జిల్లాలో అమలు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రిజర్వాయర్ ఫిల్లింగ్ , వాటర్ హార్వెస్టింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డులలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పి.ఎం సూర్యఘర్, పి.ఎం కుసుమ్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాను మరింత మెరుగు పర్చాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎడి మార్కెంటింగ్ ను కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ కిచెన్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పై అధికారులకు పలు సూచనలు చేసారు. ముందుగా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న జిల్లాలలో మన జిల్లా మూడవ స్థానంలో నిలిచిందని అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ని జిల్లా అధికారుల సంఘం తరపున మరియు రెవెన్యూ అధికారుల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, సిపిఓ రామారావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన ఆహారం అందురూ భుజించాలి

### - ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం - సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి.

### - ఏ జీవి అంతరించినా మానవాళికే ముప్పు - పేరి రామకృష్ణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 17**

ఆరోగ్యకరమైన ఆహారం అందురూ భుజించాలి అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం అనకాపల్లి జిల్లా బుచ్చయ్య పేట మండలం లోని కెపి అగ్రహారంలో తాను చేస్తున్న ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం చూసేందుకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. అయిదు అంచేల విధానం లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేస్తూ వ్యవసాయం చేస్తున్నామన్నారు. అనంతరం పంటలూ, గట్టు వ్యవసాయ విధానం అమలు చేస్తున్నామని వివరించారు. ఈ వ్యవసాయం చూస్తూ, పని చేస్తూ ముందుకు వెళ్తేనే అర్థం అవుతుంది అన్నారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కడం వల్ల కలిగే నష్టం అధిగమించడానికి ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అని పేర్కొన్నారు. అలాగే సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. పుడమి మీద ఏ జీవి అంతరించినా మానవాళికే ముప్పు ఏర్పడుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం వల్ల ఆదాయం పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది అని వివరించారు. అందుకే తాము జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తున్నామన్నారు. సమస్త జీవరాశినీ కాపాడుకోవాలని ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ వేసవిలో సమస్త జీవరాశికి నీరు అందుబాటులో ఉంచాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మేంగొ మేన్ అప్పాజీ, వారాహి ఫెడరేషన్ ప్రతినిధి రాహూల్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# గున్నేపల్లి అగ్రహారంలో తీరిన తాగునీటి కష్టాలు

### వాటర్ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 17**

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మంగళవారం అమలాపురం రూరల్ మండలం, గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల వెల్లువ కురుస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన మంచినీటి సరఫరా విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుంది

### - విద్యార్థులే విశ్వవిద్యాలయానికి అంబాసిడర్లు -సహనం, క్రమశిక్షణతో విజయం సాధ్యమవుతుంది

### - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 17**

సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూ సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని నిర్వహించిన శతాబ్ది కళా ఉత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సాధించే ప్రగతి, ప్రవర్తన విశ్వవిద్యాలయంపై ప్రభావం చూపుతుందన్నారు. వర్సిటీ విద్యార్థులు ఏయూకు అంబాసిడర్లుగా నిలవాలన్నారు. ప్రతీ వ్యక్తి జీవితంలో సంగీతం, నృత్యం అంతర్భాగం కావాలన్నారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఏయూ అభివృద్ధికి కృషి చేసిన వారిని గుర్తు చేసుకోవాలన్నారు. ఎందరో మహనీయుల కృషి ఫలితంగా నేడు ఏయూ ఇంతటి అభివృద్ధిని సాధిస్తోందన్నారు. ఏయూ మరో వెయ్యేళ్లు తన సేవలు అందించడానికి అవసరమైన బలమైన పునాదులు మనం నేడు వేయాలన్నారు. విశిష్ట అతిథి శతాధిక వృద్ధులు, సంగీతకారులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ గురువులను, తల్లిదండ్రులను ఎన్నడూ మరువరాదన్నారు. నేడు తనకు జరిగిన సన్మానం సంగీతానికి జరిగిన సన్మానంగా తాను భావిస్తానన్నారు. తన ప్రగతికి కేవలం తన గురువే కారణమన్నారు. మానవ ఆరోగ్యానికి సంగీతం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఇది తనకు మరువలేని సన్మానంగా నిలుస్తుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఏయూ విద్యార్థుతో ప్రత్యేక ప్రదర్శనలు అందించే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయానికి శతాబ్ది శోభను సంతరిప చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కళారంగంలో ఎంతో విశేష కృషి చేసిన వారిని సత్కరించుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున అన్నవరపు రామస్వామి గారిని సత్కరించి జ్ఞాపిక, సన్మాన పత్రం బహూకరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సరస్వతీ విద్యార్థి, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీతలు ఏ.బి బాల కొండల రావు, మండ సుధారాణి తదితరులు ప్రసంగించారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున మండపాక శారద, హరిరామమూర్తి, జి.శారద సుబ్రహ్మణ్యం, వై.హనుమంత రావు, ఏ.బాల కొండల రావు, మండ సుధారాణిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్‌లు, ఆచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంగీత, నృత్య విభాగం విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలు, గానం అందరిమనసులను రంజింపచేసాయి.

# 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**నున్న :( సిటిజన్ టైమ్స్ ): మార్చి:17:**

సాగును లాభసాటిగా మార్చడమే కాకుండా, దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం మంగళవారం విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతన్నలతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఖాతాల్లో నిధులు జమ కావడంపై ఆయన ఆరా తీశారు. మెజారిటీ రైతులకు నగదు జమ అయిందని, సాంకేతిక కారణాల వల్ల ఒకటి రెండు చోట్ల నిధులు రాని పక్షంలో వెంటనే అగ్రికల్చర్ ఆఫీసర్లు స్పందించి ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మొదటి రెండు విడతలు పడిన వారికి మూడో విడత కూడా కచ్చితంగా అందుతుందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతు గడప దగ్గరికే పాలనను తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ఈ వారం రోజుల కార్యక్రమాన్ని రూపొందించిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 2,000 తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 4,000 కలిపి మొత్తం నిధులను పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. గతంలో ప్రకాశం జిల్లా దర్శి, కడప జిల్లా కమలాపురం లో రెండు విడతల కార్యక్రమాలు పూర్తి చేసుకుని, మూడవ విడత నిధుల పంపిణీని గన్నవరం నియోజకవర్గ సరిహద్దు గ్రామమైన సూరంపల్లిలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. నున్న గ్రామ పెద్ద నాగేశ్వర రెడ్డి ఇంటికి వెళ్తే వ్యక్తిగత పనులు కోరకుండా గ్రామంలోని సాయిబాబా గుడి రోడ్డు వేయాలని కోరడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే 7-8 నెలల్లో నిధులు సమకూర్చుకుని ఈ రోడ్డును పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మడిచర్లలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కాలనీ రోడ్డు పనుల కోసం రూ. 90 లక్షలు కేటాయించి పూర్తి చేశామని, రామవరప్పాడు, నారాయణ అప్పారావుపేట వంటి గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని కూడా చక్కనిద్దామని చెప్పారు. అలానే మానికొండ నుంచి తరిగొప్పల వరకు ఉన్న భారీ గోతులను పూడ్చేందుకు నిధులు కేటాయించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 80% మేర గుంతల పూడ్చివేత పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20% కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, గన్నవరం మెయిన్ సెంటర్ మరియు దావాజీగూడెం రోడ్ల కోసం కృష్ణా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రూ. 4 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. నున్న గ్రామంలోని రోడ్ల విస్తరణకు రూ. 4.50 కోట్లు కేటాయించాలని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డిని కోరానని, ఆ నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రైతు సోదరుల కోసం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని యార్లగడ్డ వెంకట్రావు ఈ సందర్భంగా పురుద్ఘాటించారు. అనంతరం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ ఉన్న విద్యా వసతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. విద్యార్థుల చదువుపై ఆసక్తిని పెంచేలా ఆయన పలు ప్రశ్నలు అడిగారు. మీకు ఇష్టమైన సబ్జెక్టు ఏది?, పాఠాలు ఎలా అర్థం అవుతున్నాయి?, భవిష్యత్తులో మీరు ఏ స్థాయికి ఎదగాలనుకుంటున్నారు? అని ఆరా తీశారు. పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆయన వారిని ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఆహారం అందుతోందా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని రిజిస్టర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని ఇతర మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులతో చర్చించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, క్లస్టర్ ఇంచార్జి గుజ్జర్లపూడి బాబురావు, గ్రామ టిడిపి అధ్యక్షులు కలతోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాసరావు, మాదు శివరాం ప్రసాద్, బొకినాల తిరుపతిరావు, యార్కరెడ్డి కోటిరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, బేతపూడి ముత్తయ్య, కందుల లీలాకృష్ణ, అంగజాల శివయ్య, యార్కరెడ్డి వెంకటరెడ్డి, గండికోట సీతయ్య, ఢిల్లీ కోటేశ్వరరావు, తగరం కిరణ్, మేడేపల్లి రమ, సొంగా సంతోష్, పరుచూరి నరేష్, పట్టపు చంటి, చల్లగాలి సునీల్, మాదు మహేష్, బెజవాడ రామకృష్ణ, పావులూరి హనుమంతరావు, భూక్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**తాడేపల్లిగూడెం (సిటిజన్ టైమ్స్) మార్చి 17**

పెంటపాడు మండలం కాగులంపాడు గ్రామం, మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం, శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతోసంభాషించారు. భోజనాల్లో నాణ్యత,పరిశుభ్రత, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు, విద్యాబోధన, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య వంతులు, విద్యావంతులైన భావి పౌరులను అందించడమే మధ్యాహ్న భోజన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించటానికి ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపన నరసింహారాజు, అంగన్వాడి సూపర్వైజర్ చెరుకూరి భవాని పుల్లా బాబి, చెరుకూరి చంద్రశేఖర్, అమెరికా రాజు, రాయిప రెడ్డి మారుతి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న శ్రీ పెద్దింట్లమవారి జాతర...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 17:**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో మెండుపాలెం శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు నేటితో ముగియనున్నయని, రేపు ఉగాది రోజున శ్రీ అమ్మవారి అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాద్ (ఎఫ్ ఏ సి) తెలియజేశారు. ఆఖరి మూడు రోజులు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలియజేశారు.

# పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బీహెచ్. భవాని శంకర్ బాధ్యతల స్వీకరణ..



**కాకినాడ సిటిజన్ టైం మార్చ్ 17**

పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిహెచ్.భవాని శంకర్ మంగళవారం పిఠాపురం పాడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# కాకినాడ జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చ్ 17**


కాకినాడ జిల్లాలో ఈ రోజు నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్--2026 (డే--19) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అంతరాయాలు లేకుండా సక్రమంగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవ రావు తెలిపారు. ఈ రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం కెమిస్ట్రీ-కెమిస్ట్రీ -1 పరీక్ష నిర్వహించబడింది. జిల్లాలో మొత్తం 17,104 మంది విద్యార్థులు కేటాయించబడగా, అందులో 16,675 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై పరీక్ష రాశారు. 429 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగినట్లు పేర్కొన్నారు. అలాగే మాల్‌ప్రాక్టీస్‌కు సంబంధించిన ఎటువంటి ఘటనలు నమోదు కాలేదని తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పరిశీలకులు ( స్టేట్ అబ్జర్వర్) జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు డా. జె. రాంబాబు (డి ఈ సి--1), వి. శ్రీనివాస్ (డీఈసీ 2, డి.వి.కె. వర్మ (డి ఈ సి-3) కూడా పర్యవేక్షణ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రశాంతంగా మరియు క్రమబద్ధంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు.

# ప్రజలందరి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

**వేమవరంలో వి హెచ్ సి భవనానికి శంకుస్థాపన చేసి... 'రైతన్న మీకోసం'లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము.**

**కాలినడకన రైతన్నల ఇళ్లకు వెళుతూ మీ కోసం కరపత్రాలు అందించిన ఎమ్మెల్యే.**

**ఎమ్మెల్యే రాముకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ... కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన రైతులు.**




**గుడ్లవల్లేరు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి 17:**

ప్రజలందరి మంచి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే రాము పర్యటించారు. ముందుగా గ్రామంలో రూ.36 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే గ్రామంలో కాలి నడకన పర్యటిస్తూ రైతుల ఇళ్లకు వెళుతూ మీకోసం కరపత్రాలను అందించి వారితో ముఖాముఖిగా మాట్లాడారు. గ్రామంలో రైతులు ఎమ్మెల్యే ఆత్మీయ స్వాగతం పలుకుతూ, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని,ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గ పరిధిలో దశాబ్దాలుగా పరిష్కృతంగా ఉన్న అనేక ప్రధాన రహదారుల సమస్యలను పరిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సహకారంతో... గుడివాడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సాయన పుష్పవతి,వేమవరం సర్పంచ్ పద్మావతి టిడిపి నాయకులు వల్లభనేని వెంకట్రావు , పోలవరపు వెంకటరావు, కొడాలి రామరాజు, మల్లిపెద్ది సుబ్రమణ్యం, పామర్తి సత్తిబాబు, కాగిత నరేంద్ర, ఈడే కృష్ణారావు , శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఈడే మోహన్ , బొల్ల అంకల్రావ్, మన్యం నరసింహారావు , బుర్ర నాగేశ్వరరావు, అట్లూరి ప్రసాద్,సాయన ప్రసాద్ , అమీర్, అబ్దుల్ సత్తార్, తూము పద్మజ, దివ్య చౌదరి,జనసేన నాయకులు తోట చిన్నారి, అడపా బాబి,కటకం కొండ,ఎండిఓ ఇమ్రాన్, డాక్టర్ శ్రావ్యా,వ్యవసాయ అధికారి సునీల్, ఏఈఓ ప్రదీప్,ఏఈ నాగేశ్వరావు , ఏవో సునీల్ మరియు సిబ్బంది, ఏఎన్ఎం లు, వైద్య సిబ్బంది, టిడిపి శ్రేణులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ కళావేదిక ఉగాది సేవా పురస్కారము...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 17:**

చైతన్య సారస్వత పరిషత్, శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్ కి ఉగాది సేవా పురస్కారాన్ని మంగళవారం నాడు అంతర్వేది దేవస్థానం ఆవరణలో అందజేశారు. కవి శ్రీనాధుని వంశీయులు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రసాద్ ను ఈ పురస్కారానికి ఎంపిక చేసి, వారికి దూశాలువా మెమెంటో తో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కళావేదిక సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# పాఠశాలలో మంత్రి అకాస్మిక తనిఖీ

**మైలవరం:( సిటిజన్ టైమ్స్ ): మార్చి: 17:**

ఎన్టీఆర్ జిల్లా. మైలవరంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దేవుడు చెరువులోని ఎంపీపీ స్కూలును అనూహ్యంగా మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత పై ఫిర్యాదులు రావడంతో గతంలోనే స్కూల్ ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసి వంట ఏజెన్సీని రద్దు చేయడం జరిగింది. ప్రస్తుత పరిస్థితులను తెలుసుకునేందుకు అనూహ్యంగా సందర్శించారు.స్థానిక ఎమ్మెల్యేకు అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తానే స్వయంగా స్కూలు విద్యార్థిని విద్యార్థులను మధ్యాహ్నం భోజనం నాణ్యత పై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి అధికారు లై న చర్యలు తప్పవు అన్నారు. అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ బయలుదేరారు. స్థానిక ఎమ్మెల్యేకు అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.






# గాలికుంటు వ్యాధి నివారణ
# గోడపత్రిక ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 17**

గాలికుంటు వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నియంత్రించాలని లక్ష్యంతో వ్యాధి నివారణ టీకాలు ఏడాదిలో రెండు సార్లు క్రమం తప్ప కుండా వేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి తెలిపారు.గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమ గోడ పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆవిష్కరించారు.జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమాన్ని మార్చి 16 నుండి ఏప్రిల్15 వరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 4 నెలల వయసు పైబడిన ఆవు, గేదె జాతి పశువులకు ఈ టీకాలు వేయనున్నట్లు ఆమె వెల్లడించారు.ఈ సందర్భం గా పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించడం చాలా ముఖ్యమన్నారు.రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. 32వ విడత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈనెల 16 సోమవారం నుండి ప్రారంభం అయిందన్నారు.జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హిస్తున్న కార్యక్రమం లో భాగంగా జిల్లాలో పలు మండలాలను పశు సంవర్ధకశాఖ పరిధిలో టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.ఈ గాలి కుంటు వ్యాధి నివార ణా టీకాల కార్యక్రమాన్ని ఈనెల 16నుండి వచ్చే నెల ఏప్రిల్ 15 వ తారీకు వరకూ నెల రోజుల పాటు నిర్వహిస్తారన్నారు.ఈ ఉచిత టీకాల గోడపత్రిక ఆవిష్క రణ సందర్భంగా పశుసం వర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె భవానీ ప్రసాద్ మాట్లాడుతూ. ప్రతి పాడి పశువుకూ 4 నెలలు నిండిన దూడ దగ్గర నుంచి అన్ని వయ సుల్లో ఉన్న పశువులకూ ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా వేస్తున్నదని వెల్లడించారు.ఈ అవకాశాన్ని పాడి రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.పశువుల మకాముల్లో వదలకుండా ఇళ్ల వద్దనే కట్టుకునే విధంగా సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.



పశువుల్లో గాలికుంటు (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) వ్యాధి అంటువ్యాధనీ ఇది పాడి పశువులు, గేదెలు, గొర్రెలు,మేకల్లో ఎక్కువగా కనిపి స్తుందన్నారు ఈ వ్యాధి నివారణకు శుభ్రత, సరైన ఆహారం, ముఖ్యంగా ప్రభుత్వ ఉచిత టీకా కా ర్యక్రమాలు కీలకం అయ్యాయన్నారు.పశు శాలలు, పాకలను శు భ్రంగా ఉంచా లని కలుషిత నీరు,గాలి నుండి రక్షణ కల్పించాలన్నారు. సరైన ఆహారం, తాగునీరు సరఫరా చేస్తూ వ్యాధి సోకిన పశువుల ఆరోగ్య పరిరక్షణకు సిబ్బంది పాటుపడాలన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బందికి పశువుల రైతులు సహకరించి వారి పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ విజయ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వం...

### చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్...



**లింగాపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 17**

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా లింగాపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో కూటమి నాయకులు అందరితో కలిసి వ్యవసాయ అసిస్టెంట్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ఎమ్టీస్ , ఐసిఆర్పీలు కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రైతులను కలిసి సర్వేలో పాల్గొనడం జరిగింది . "అన్నదాత సుఖీభవ" కార్యక్రమంలో భాగంగా రైతులు ఖాతాలో ప్రభుత్వం నగదు వేసిన విషయాన్ని రైతులకు తెలియజేయడం జరిగింది .ఈ విషయం పై రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గారపాటి నాగ బుద్ధ వర ప్రసాద్ (బుజ్జియ్య) చెరువుగట్టు రామ్మోహన్ రావు, గజ్జా వెంకటేశ్వరరావు, పఠాన్ లాలూ, చిట్లూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 24న అథ్లెటిక్స్ మాస్టర్ ఎంపిక

### జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆరుద్ర

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చ్ 17**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో లాంగ్వేజెస్ 2026 కార్యక్రమంలో భాగంగా, మార్చి 24, 2026 న అమలాపురం లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (జి.ఎం.సి. బాలయోగి స్టేడియం) లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మాస్టర్స్ ఎంపికలు నిర్వహించబడనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి.ఆర్ రుద్ర తెలిపారు. 35, 45 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళల విభాగాల్లో ఈ ఎంపికలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ ఎంపికలలో క్రింది క్రీడా విభాగాలు 100 మీటర్లు,400 మీటర్లు, 800 మీటర్లు 1500 మీటర్ల పరుగు,లాంగ్ జంప్,హై జంప్,షాట్ పుట్,డిస్కస్ త్రో, జావలిన్ త్రో,4ఐ100 మీటర్ల రిలే ఉంటాయని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనదలచిన అర్హులైన క్రీడాకారులు మార్చి 246 లోపల శాప్ వెబ్సైట్ల లో స్పోర్ట్స్ డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ స్పోర్ట్స్ లోని సాప్ లాంగ్వేజెస్ ద్వారా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవలెను. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే ఈ క్రీడా పోటీలకు అర్హులు లేనియెడల రిజిస్టర్ అవని వారు అనార్హులుగా పరిగణింపబడతారని తెలిపారు. అర్హత సాధించిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయబడతారు. ఈ ఎంపికలు ఉదయం 7:00 గంటల నుండి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వివరాలకు 7993329433, 8499963763 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



## మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ సిటిజన్ టైమ్స్ మార్చి 17**

మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ఎస్ఆర్ఎంటి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమడి కొండబాబు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున జిల్లా మైనారిటీ శాఖ ద్వారా అనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాకినాడ పట్టణంలో ఈరోజు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సుమారుగా 1500 నుంచి 2000 మంది ముస్లిం సోదరులు హాజరై తమ ఉపవాస దీక్ష విరమణ, నమాజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ముస్లిం సోదరులు శాంతియుతంగా, ఐక్యమత్యంతో ఆనంద ఉత్సాహాలతో ఈ రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని మైనారిటీ వర్గాలకు అధిక ప్రాథమికనిస్తూ ముస్లిం సోదరులకు రాష్ట్ర వ్యాప్తంగా ఇఫ్తార్ విందులు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి షాదీ ఖానాలు, మసీదులు నిర్మించడంతోపాటు ముస్లిం సోదరులకు అవసరమైన ఇతర ఏర్పాట్లు చేస్తుందని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సోదర భావాన్ని చాటుతు ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగను జరుపుకోవాలని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ డి.వీరవేణి, రాష్ట్ర మైనారిటీషన్లో వైస్ ప్రెసిడెంట్ ఎంఏ సయ్యద్, ముస్లిం మత గురువు గౌస్య హాజరత్, ఇతర ముస్లిం సోదరులు మఖ్బుల్ ఆలీ, బాక్సర్, అన్సర్, రహీం, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




## అనాతవరం పాస్టర్ పై రాజోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**రాజోలు సిటిజన్ టైమ్స్ మార్చి 17**

విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్, హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో రాజోలు పోలీస్ స్టేషన్లో ఇటీవల మమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన పాస్టర్ చంటిదొర హిందువులు మనోభావాలు దెబ్బతినే విధంగా తీవ్ర వ్యాఖ్యలు చేసి సనాతన ధర్మం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడితే కత్తితో తల నరికేస్తానంటూ శాంతి భద్రతలు భంగం కలిగేలా మాట్లాడిన పాస్టర్ పై నాన్ బెయిల్ బుల్ చట్టాలు నమోదు చేయాలని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా కట్టిన చర్చిని పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం నెలల 5వేల రూపాయలు ఇస్తున్న గౌరవ వేతనాన్ని వెంటనే నిలిపి వేయాలని ఫిర్యాదు చేశారు.

## ఆహ్లాదభరిత వాతావరణంలో ముగిసిన జిల్లా పోలీసు వార్షిక క్రీడా పోటీలు..

### ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్..

**కాకినాడ ఇన్చార్జ్ బ్యూరో సిటిజన్ టైమ్స్ మార్చి 17**

కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలు (స్పోర్ట్స్ మీట్) ఆహ్లాదభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పోలీసు అధికారి బిందు మాధవ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం మరియు మానసిక స్థైర్యం పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ చురుకుగా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఉపకరిస్తాయని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బందిలో జట్టు భావన, క్రమశిక్షణ మరియు ఆరోగ్య పరిరక్షణను పెంపొందించడంలో ఈ క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




## కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 42 ఆశా కార్యకర్తల ఉద్యోగాల భర్తీ

**కాకినాడ సిటిజన్స్ టైమ్స్ మార్చి 17**

కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 42 ఆశ కార్యకర్తల ఉద్యోగుల భర్తీయా భర్తీ కి అర్హులైన అభ్యర్థుల నుంచి 03-07-2025 తేదిన 302 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని,దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ వారి ఆదేశాలు మేరకు జిల్లా హెల్త్ సొసైటీ కమిటీ వారు 25-02-2026 వ తేదిన దరఖాస్తు చేసుకున్న వారి అందరిని ఇంటర్వ్యూకు ఆహ్వానించి వారియొక్క కమ్యూనికేషన్ స్కిల్స్, జెనరల్ నాలెడ్జ్,సామాజిక ఆరోగ్య మరియు అవగాహన పైన ఇంటర్వ్యూ చేయడం జరిగిందనీ, డిస్టిక్ హెల్త్ సొసైటీ కమిటీ మరియు రాష్ట్ర కమ్యూనిటీ ప్రాసెస్ వారి గైడ్లైన్స్ ప్రకారం ఈ యొక్క ఆశ కార్యకర్తలను ఇంటర్వ్యూ మార్కులు మరియు ,మెరిట్ ఆధారంగా ఎశీపిక చేసి, కాకినాడ జిల్లా అర్బన్ పరిదిలో -13 మరియు కాకినాడ జిల్లా రూరల్ పరిదిలో -28, వెరసి మొత్తం 41- ఆశా కార్యకర్త పోస్ట్ లను ఎశీపిక చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. తిప్పే నాయక్ తెలిపారు.ఎంపికైన అబ్యర్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి నుండి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని తెలియజేసారు.


## నిల్వ కోడి మాంసం సీజ్



**సికింద్రాబాద్ : మార్చి 17: (సిటిజన్ టైమ్స్)**

పార్సి గుట్టలోని ఏ వన్ ఫ్రెష్ చికెన్ షాప్ పై టాస్క్ ఫోర్స్ జిహెచ్ఎంసి అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. చాలా రోజుల నుంచి నిల్వ ఉంచిన చికెన్ ను బార్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించి, ఎనిమిది వందల కిలోల చికెన్ ను స్వాధీనం చేసుకున్నారు. జనవరిలోనే లైసెన్స్ గడువు ముగిచినట్లు పోలీసులు గుర్తించారు. షాపు నిర్వాహకుడు షకీల్ తో పాటు మరి కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు.

## భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త



**జగిత్యాల జిల్లా : మార్చి 17: (సిటిజన్ టైమ్స్ )**

ధర్మపురిలో దారుణం చోటుచేసుకుంది. అనుమానంతో భార్య రమ్య పై భర్త నవీన్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అడ్డువచ్చిన అత్తమామలపై దాడి చేసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రమ్యను చికిత్స నిమిత్తం కరీంనగర్ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రేమించి పెళ్లి చేసుకున్న నవీన్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు.

## మున్సిపల్ కౌన్సిలర్స్‌కు ఘన సత్కారం

**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ మార్చి 17**

పట్టణం లోని కౌన్సిలర్స్ గా 5 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని పదవి విరమణ పొందుతున్న శుభ సందర్భంగా, వీడ్కోలు పలుకుతూ ,సత్యం ఫౌండేషన్ అధినేత శ్రీవాసంశెట్టి సత్యం,జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీపోలిశెట్టి చంద్రశేఖర్, కూటమినాయకులు,మున్సిపల్ ఉన్నతాధికారులు, మున్సిపల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.



# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ఆశయం

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

రైతు సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ఆశయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షత వహించగా, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, ఎడమ కళ్ళు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఆ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసి కృషి చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి 20 వేల రూపాయలు చొప్పున రైతుల ఖాతాలలో జమ చేస్తున్నదని ఆయన తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందజేస్తున్నదని ,పండ్లతోటల అభివృద్ధికి ఎంతో



కృషి చేస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.రైతులను రారాజుగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ఆశయమని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటుగా, గిట్టుబాటు లేని పంటలను వ్యవసాయ మార్కెట్ల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు .ఆ సందర్భంగా ఆయన రైతులతో కలసి గ్రామంలో పర్యటించి రైతు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు రైతన్న



మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు తిరుమలరెడ్డి, షేక్ హసీనా, గజ్జలకొండ నారాయణ, బాదినేని పల్లె గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామదేవతలను దర్శించుకున్న మాజీ మంత్రి మానుగుంట





**కందుకూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

పట్టణంలోని పోలేరమ్మ తల్లి, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 22 ఆదివారం శ్రీ అంకమ్మ తల్లికి పాలపొంగల్లులో భాగంగా మహాలక్ష్మమ్మకు పానకం, వడపప్పు పోలేరమ్మ తల్లికి జరుగుతున్న చద్దుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహీధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతలైన శ్రీ అంకమ్మ తల్లి పోలేరమ్మ తల్లి మహాలక్ష్మమ్మ కృప నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామదేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్య నాయుడు, మాదాల మాల్యాద్రి, గంగవరపు వెంకటరావు, మాదాల నరసింగరావు తదితరులు ఉన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులకు అవగాహన

**మండల వ్యవసాయాధికారి పి మధుబాబు**



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

మండలంలోని రెడ్డిగారికొత్తపల్లి గ్రామంలో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సందేశాన్ని రైతులకు, ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎలినినో ప్రభావం వల్ల వర్షపాతం లోపాలు ఏర్పడే అవకాశాలు, పశ్చిమ ఆసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధాల ప్రభావం వ్యవసాయ రంగంపై పడే అవకాశాల గురించి వివరించారు. అదేవిధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాల గురించి తెలియజేస్తూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించుటకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు ఈ కార్యక్రమంలో చావా చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు

## గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలి

**ఎంఈఓ రాజాల కొండారెడ్డి**



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

మండలంలోని ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో గ్యారంటీడ్ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రం సి.ఎస్.పురం లోని ప్రాథమిక పాఠశాల లను ఆయన సందర్శించి ఎఫ్ఎల్ఎన్ అమలు విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో బోధన తీరును పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తేనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని, శనివారం క్లస్టర్ స్థాయిలో, ఈ నెల 24వ తేదీన మండల స్థాయిలో ప్రతిభా సామర్థ్య పరీక్షలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల, జిల్లా స్థాయి విజేతలకు సర్టిఫికెట్లు మరియు మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో నిర్వహించి నూరు శాతం నమోదు నిలకడ సాధించాలని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు సూచించారు.

## ఆస్తి పన్నుపై వడ్డీకి 50 శాతం భారీ రాయితీ

# మార్చి 31 డెడ్‌లైన్, వెంటనే చెల్లించండి!

**పన్ను చెల్లించండి , వడ్డీ భారాన్ని తగ్గించండి**

**-అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి -మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు**



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

గిద్దలూరు పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని. ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీని ప్రకటించగా, ఈ అవకాశాన్ని ప్రజలు తప్పక వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మార్చి 31లోపు పాత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర పన్నును ఒకేసారి చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత పూర్తి వడ్డీతోనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సదుపాయం ద్వారా ప్రజలు తమ వడ్డీ భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని, ఇదొక సువర్ణావకాశమన్నారుకుళాయి పన్నులు, ఖాళీ స్థల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా సమయానికి చెల్లించాలని సూచించారు.

**గిద్దలూరు అభివృద్ధి మనందరి బాధ్యత**

గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ప్రతి ఒక్కరు చేయి కలపాలని కమిషనర్ పిలుపునిచ్చారు. మనం చెల్లించే ప్రతి రూపాయి పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికే వినియోగించబడుతుందన్నారు. ఈరోజు అభివృద్ధి రేపటి భావితరాల భవిష్యత్తు ఈరోజు మనం చేసే అభివృద్ధి రేపటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందని, అందరూ కలిసి గిద్దలూరును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే గిద్దలూరు లో అనేక శివారు ప్రాంతాల్లో సి సి రోడ్లు డ్రైనేజీలు, ఇతరత్రా సౌకర్యాల కల్పన చేస్తున్నసమన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు. సకాలంలో పన్నులు చెలియించి అభివృద్ధి కి తోడ్పాటు అందించాలన్నారు. పేరుకు పోయిన బకాయిల కు ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటీచిందన్నారు. మున్సిపాలిటిలో ని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని మున్సిపాలిటీ అభివృద్ధి కి తోడ్పాటు అందిచాలని కోరారు. పన్నులు సకాలంలో చెల్లింపు చేసి మున్సిపాలిటి తమ వంతు సహకారం అందించాలన్నారు.

## బోయిన రాయుడు చొరవతో నీటి సమస్య పరిష్కారం



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం రామాలయం వీధిలో కొట్టుడు బోరింగ్ చెడిపోవడంతో నెలకొన్న నీటి సమస్యకు టిడిపి యువనేత బోయిన రాయుడు చొరవతో పరిష్కారం లభించింది. బోరింగ్ చెడిపోవడంతో పైపులు లాగడానికి మనుషులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న బోయిన రాయుడు వెంటనే స్పందించి సిఎస్పురం పంచాయతీ సెక్రెటరీ శ్రీహరితో మాట్లాడి, మెకానిక్ లింగయ్యను తీసుకువెళ్లారు. అనంతరం స్నేహితులను పిలిపించుకొని వారి సహకారంతో పైపులను లాగించి బోరింగ్ మరమ్మత్తు పనులు చేపట్టించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా బోయిన రాయుడు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే గుర్తించి స్పందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. రామాలయం వీధి ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన వెంటనే రిపేరు చేయించినట్లు తెలిపారు బోరింగ్ రిపేరు పూర్తయి నీటి సమస్య తీరడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, బోయిన రాయుడు సేవా కార్యక్రమాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో తోట పవన్, చిందే సాయి, గ్రంధి సాయి, మెకానిక్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాదినేనిపల్లి పంచాయతీలో

# రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

కొమరోలు మండలం బాదినేని పల్లె పంచాయతీలో తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సోమ మంగళ వారాలలో రైతన్న మీకోసం కరపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది .రైతుల సంక్షేమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అనేక పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కరపత్రాలను ముద్రించి విడుదల చేసింది. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు కొమరోలు మండలం బాదినేని పల్లె గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి రైతన్న మీకోసం కరపత్రాలను పంచాయతీలోని గ్రామాలలో ఇంటింటికి పంపిణీ చేశారు. ఆ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను వివరించి రైతులకు అవగాహన కల్పించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి ,ప్రజా సంక్షేమానికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఆయన వివరించారు. ఆ కార్యక్రమంలో పలువురు



తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. బాదినేనిపల్లి పంచాయతీలో రైతన్న మీకోసం కరపత్రాలను ఇంటింటికి పంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పిస్తూ, గ్రామాలలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న యూనిట్ ఇంచార్జి ముత్తుముల ఎల్లారెడ్డి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

**సంతృప్తి వ్యక్తం చేసిన హెచ్.ఎం.బోడ ప్రసాద్**



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

ఇంటర్మీడియట్ తొలి సంవత్సరం పరీక్షలు మంగళవారం విద్యార్థుల కేరింతల నడుమ ప్రశాంతంగా ముగిసినట్లు కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల ప్రధానోపాధ్యాయులు బోడా ప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వహించారని, గత సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా మా పాఠశాలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో భాగంగా సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పూర్తి చేసిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్మెంట్ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పరీక్షలు పూర్తవడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతూ ఒకరినొకరు అభినందించుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## బహిరంగ వేలంపాటలో నారాయణస్వామి ఆదాయం రూ.19.94 లక్షలు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 17**

మండలంలోని కోవిలంపాడు పంచాయతీ పరిధిలో గల మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణస్వామి దేవస్థాన ఆవరణలో మంగళవారం ఆగిన దుకాణాల నిర్వహణ హక్కులకు బహిరంగ వేలంపాటలు నిర్వహించగా రూ.19,94,100/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహ బాబు తెలిపారు ఈ వేలంపాటలను కందుకూరు డివిజన్ ఇన్స్పెక్టర్ జి.ఏ. సత్యనారాయణ మరియు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ ఇటీవల వేలంపాటలో నిలిచిపోయిన దుకాణాలకు బహిరంగ వేలంపాటలు నిర్వహించగా కొబ్బరికాయలు మరియు పూజా ద్రవ్యాలు అమ్ముకొను హక్కు రూ.7,30,000కు, ఫ్యాన్సీ ఐటమ్స్ అమ్ముకొను హక్కు రూ.4,28,000కు, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను హక్కు రూ.3,15,000కు గాజులు అమ్ముకొను హక్కు రూ.2,20,000కు, చిల్లర సరుకులు అమ్ముకొను హక్కు రూ.2,30,000కు, పడి బియ్యం ప్రోగు చేసుకొను హక్కు రూ.55,000కు, పాదరక్షలు భద్రపరుచుకొను హక్కు రూ.10,100 కు హెచ్చు పాటదారులు పాడినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతలపూడి ఏఎంసీ చీదరాల మధుబాబుకి జన్మదిన శుభాకాంక్షలు

**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 17**



జనసేన పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు గారికి లింగపాలెం మండలం జనసేన పార్టీ తరుపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లింగపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పంది మహేష్ బాబు మరియు జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు.

# ఐకాన్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్ గా!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలన్నీ అనుకున్నట్లుగా విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్ స్టార్‌గానే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమలోనే అజేయమైన గ్లోబల్ ఐకాన్ గా ఎదిగే అవకాశం ఉంది. -పుష్ప-తో ఇప్పటికే పాన్-ఇండియా మార్కెట్‌ను శాసించిన బన్నీ, రాబోయే చిత్రాలతో తన ప్రభావాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.వచ్చే ఐదేళ్లలో ఆయన లోకేష్ కనగరాజ్, సుకుమార్, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగా వంటి అగ్ర దర్శకులతో చేయబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే గనుక భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక కమర్షియల్ స్టామినా ఉన్న హీరోగా బన్నీ నిలుస్తారు. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో బన్నీకి ఉన్న క్రేజ్ అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్ రేంజ్‌కు చేరుకోవడమే కాకుండా, సౌత్ నుంచి నార్త్ వరకు ఏకఛత్రాధిపత్యం వహించే మెగా పాన్-ఇండియా సూపర్ స్టార్ గా బన్నీ అవతరిస్తారు. సాంకేతికంగా , నటన పరంగా కూడా బన్నీ సరి కొత్త శిఖరాలను అధిరోహిస్తారు. త్రివిక్రమ్ సినిమాతో విజువల్ వండర్స్, సందీప్ వంగాతో రా అండ్ రస్టిక్ యాక్షన్ వంటి వైవిధ్యమైన జోనర్లు చేయడం వల్ల, ఆయన నటనలో ఉన్న అన్ని కోణాలు ప్రపంచానికి పరిచయమవుతాయి. ఇది కేవలం బాక్సాఫీస్ నంబర్లకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు ,అంతర్జాతీయ చలనచిత్ర వేదికలపై భారతీయ సినిమాకు ప్రతినిధిగా అల్లు అర్జున్‌ని నిలబెడుతుంది. రాజమౌళి సినిమాల తర్వాత ఆ స్థాయి ప్రభావాన్ని చూపగల సత్తా ఉన్న హీరోగా బన్నీ పేరు మారుమోగిపోతుంది.

ఈ ఐదేళ్ల విజయ పరంపర అల్లు అర్జున్‌ను టాలీవుడ్ నెంబర్ వన్ స్థానంలో తిరుగులేని వ్యక్తిగా మార్చేస్తుంది. రికార్డులే కాకుండా, తనకంటూ ఒక సొంత సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, భవిష్యత్ తరాల నటులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచే అవకాశాలున్నాయి. 2030 నాటికి భారతీయ చిత్ర పరిశ్రమ గురించి ఎక్కడ చర్చ జరిగినా? అల్లు అర్జున్ పేరు మొదటి వరుసలో ఉండటం ఖాయం. ఆ విజయం ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా, సినిమా మార్కెట్‌ను శాసించే ఒక మహోన్నత శక్తిగా తీర్చిదిద్దుతుంది. ప్రస్తుతం బన్నీ తమిళ దర్శకుడు అట్లీతో కలిసి ఓ గ్లోబల్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో బన్నీ మూడు-నాలుగు గెటప్స్ లో కనిపించ నున్నాడు? అన్న ప్రచారం సినిమాకు అంతకంతకు హైప్ తీసుకొస్తుంది. పాన్ వరల్డ్ లో ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.





**కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్**



**శివంగి వర్మ సొగసైన లుక్స్**

# టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్!



భారత జట్టు వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విజయంతో టీమిండియాకి ఐసీసీ ట్రోఫీ అందించిన కెప్టెన్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ చేరాడు. ఈ టోర్నమెంట్ తర్వాత అతడు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటాడని, ఆటకు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. న్యూజిలాండ్ పై ఫైనల్లో గెలిచిన తర్వాత ఒలింపిక్స్-2028లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే సూర్య క్లియర్ గా చెప్పేశాడు. కెప్టెన్సీ వ్యవహారంపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇండియన్ టీమ్ టీ20 కెప్టెన్ గా ఎవరూ ఊహించని పేరును ప్రతిపాదించాడు. జట్టులో చోటే లేని ప్లేయర్ కి జట్టు టీమ్ పగ్గాలు ఇవ్వాలని చెప్పడం గమనార్హం. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కి టైటిల్ అందించిన కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. గతేడాది పంజాబ్ కింగ్స్ కి వెళ్లిన ఈ ముంబై బ్యాటర్.. ఆ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. సారథిగా, బ్యాటర్ గా రాణించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయినప్పటికీ శ్రేయస్ ని సెలక్టర్లు పెద్దగా పట్టించుకోలేదు.. అతడు ఫామ్ లో ఉన్నప్పటికీ.. టీమ్ లో మాత్రం చోటు ఇవ్వలేకపోతున్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తేల్చి చెప్పారు. ఆసియా టీ20 కప్-టోర్నీకి జట్టుని ప్రకటించిన సందర్భంగా ఈ కామెంట్స్ చేశారు. ఇక టీ20 వరల్డ్ కప్ - 2026 జట్టులోనూ అయ్యర్ కి స్థానం లభించలేదు.

దేశీయ లీగ్స్, ఐపీఎల్లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్ ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో ఆకాశ్ చోప్రా మాత్రం అయ్యర్ భారత జట్టు టీ20 కెప్టెన్ ఎందుకు కాకూడదంటూ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఐపీఎల్-2026లో పంజాబ్ కింగ్స్ సారథిగా, బ్యాటర్ గా

రాణిస్తే అతడికి మరో ఛాన్స్ దక్కుతుందని అన్నారు. శ్రేయస్ టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉంటాడని నేను అనుకున్నాను.. మిడిలార్డర్ లో ఒకవేళ చోటు ఖాళీ అయితే కచ్చితంగా అది అతడికే దక్కేది అన్నారు. కాబట్టి త్వరలోనే శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టులోకి వచ్చే ఛాన్స్ కనిపిస్తుందన్నారు.ఇక కెప్టెన్సీ విషయానికొస్తే.. ఇండియన్ టీమ్ తదుపరి కెప్టెన్ గా శ్రేయస్ ఎందుకు ఉండకూడదు? అందుకు అవకాశం ఉందని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

# ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్.. టికెట్ల అమ్మకం షెడ్యూల్ రిలీజ్








మార్చి 28 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మొదటి దశలో సొంతగడ్డపై జరిగే మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాల షెడ్యూల్‌ను ముంబై ఇండియన్స్ (మార్చి 17న) విడుదల చేసింది. బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ముంబై ఇండియన్స్ తొలి దశలో మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో హోమ్ మ్యాచ్‌తో తమ జర్నీని స్టార్ట్ చేయనుంది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పై ఇతర వేదికల్లో మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత మళ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే కీలక మ్యాచ్ ని వాంఖెడే స్టేడియంలో ఆడనుంది.ఈ మ్యాచులకి సంబంధించిన టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో దీశీశీవిమీూష్త్రశీష వెబ్‌సైట్, యాప్ ద్వారా ఎం-టికెట్ల రూపంలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈసారి టికెట్ల విక్రయాన్ని నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గూగుల్ పే ఉపయోగించే వినియోగదారులకు మార్చి 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి మార్చి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు టికెట్లు బుక్ చేసుకునే ఛాన్స్ కల్పించారు. రెండో దశలో ఎంఐ గోల్డ్, సిల్వర్, జూనియర్ మెంబర్లకు మార్చి 21 మధ్యాహ్నం 3 గంటల నుంచి మార్చి 22 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

మూడో దశలో ఎంఐ బ్లూ మెంబర్లు, ముందుగా రిజిస్టర్ చేసుకున్న దీశీశీవిమీూష్త్రశీష యూజర్లకు మార్చి 22వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మార్చి 23 సాయంత్రం 5 గంటల వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయి. చివరి దశలో సాధారణ ప్రజలకు మార్చి 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి టికెట్ విక్రయం ప్రారంభమవుతుంది. మెంబర్‌షిప్ ద్వారా ముందస్తు బుకింగ్ సదుపాయం పొందాలంటే, మార్చి 19వ తేదీ రాత్రి 11:59 లోపు మెంబర్‌షిప్ తీసుకోవాలని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ స్పష్టం చేసింది. అభిమానులకు ప్రాధాన్యత కల్పించేందుకు ఈ విధంగా దశలవారీగా టికెట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంప్‌ను స్టార్ట్ చేసింది.

# రాహుల్ ద్రవిడ్ డ్యాన్స్ సూపర్.. నన్ను పార్టీకి పిలవకపోయినా వెళ్లాను..



ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు భారత మాజీ ఫాస్ట్ బౌలర్ శ్రీశాంత్ తన క్రికెట్ కెరీర్‌లో జరిగిన ఆసక్తికర సంఘటనలను షేర్ చేసుకున్నాడు. ముఖ్యంగా టీమిండియా చేసుకునే పార్టీల గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శ్రీశాంత్ మాట్లాడుతూ.. తమ కాలంలో మ్యాచ్‌లు గెలిచిన తర్వాత ప్లేయర్స్ ఎక్కువగా నైట్ పార్టీల్లో పాల్గొనేవారని చెప్పాడు. సీనియర్ ఆటగాళ్లు మాత్రం త్వరగా నిద్రపోవడాన్ని ఇష్టపడేవారని గుర్తు చేశాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ లాంటి వారు త్వరగా నిద్రపోతారు.. కానీ సౌరభ్ గంగూలీ మాత్రం ఎక్కువగా తన గదిలోనే ఉండేవాడు.. భారీ విజయాలు సాధించినప్పుడు మాత్రం అందరం కలిసి సెలబ్రేట్ చేసుకునేవాళ్లమని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.పాకిస్థాన్‌లోనే పాక్ పై సిరీస్ గెలిచిన సందర్భాన్ని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ గుర్తు చేసుకుంటూ.. ఆ సిరీస్ నా ఫస్ట్ విదేశీ టూర్.. ఆ రోజు మాత్రం అందరం కలిసి రాత్రి పొద్దుపోయే వరకు ఎంజాయ్ చేశాం.. ఈ సందర్భంగా రాహుల్ ద్రవిడ్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. రాహుల్ భాయ్ చాలా బాగా డాన్స్ చేస్తాడు.. ఇది చాలా మందికి తెలియదన్నాడు. మైదానంలో కూల్‌గా, క్రమశిక్షణతో కనిపించే ద్రవిడ్‌కు ఈ టాలెంట్ ఉందని చెప్పడంతో ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, 2008 ఐపీఎల్ ఫైనల్ తర్వాత జరిగిన పార్టీకి నన్ను ఆహ్వానించలేదు, అయినప్పటికీ నేను వెళ్లినట్ల శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ తర్వాత పార్టీ జరిగింది.. ఆ పార్టీకి నాకు ఆహ్వానం లేకపోయినా 'పర్పుల్ క్యాప్' కోసం వెళ్లాను.. షేన్ వార్న్ లాంటి లెజెండ్స్ అక్కడ ఉండడంతో నేను కూడా పార్టీలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఆ సీజన్‌లో శ్రీశాంత్ 19 వికెట్లు తీసుకోగా, పాకిస్థాన్ బౌలర్ సోహైల్ తన్వీర్ 22 వికెట్లతో పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టు షేన్ వార్న్ నాయకత్వంలో టైటిల్ గెలుచుకుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776